క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ల అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ ఇస్తున్న ఎమినిటీస్ సెక్రటరీ అమూల్య

మల్కాపురం: వైద్య సేవల నిమిత్తం దూర ప్రాంతంలో ఉన్న లబ్ధిదారుల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లి శుక్రవారం పింఛన్లు అందించారు. 58వ వార్డు పిలకవానిపాలెం ప్రాంతానికి చెందిన రావాడ ఎల్లమ్మ నగరంలోని ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ములగాడ-2 ఎమినిటీస్ సెక్రటరీ అమూల్య పింఛన్ అందించారు.

61వ వార్డు గాంధీవీధి ప్రాంతానికి చెందిన షేక్ ఆశ అనే మహిళ అనారోగ్యం కారణంగా విజయనగరంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంత సచివాలయ శానిటరీ సెక్రటరీ గంజి శ్రీనివాస రావు అక్కడకు వెళ్లి పింఛన్ అందించారు.

జీవీఎంసీ పాఠశాలలో తనిఖీలు



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో సువర్ణ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సువర్ణ ఆకస్మిక తనిఖీలు చేశారు. నేరుగా పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఇంత వరకు వారు నేర్చుకున్న సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు ఎలా ఉన్నాయి, ఉపాధ్యాయుల ఎలా బోధిస్తున్నారు. మౌలిక వసతులు ఎలా ఉన్నాయి వంటి వాటిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



వుడా కాలనీలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: గోపాలపట్నం వుడాకాలనీలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్యాంగ్ వర్క్ ద్వారా పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు పార్కును శుభ్ర పరిచారు. జోనల్ కమిషనర్ హేమావతి ఆదేశాలతో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఎస్ఎస్ వీవీ రమణ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. పిచ్చి మొక్కలు వల్ల దోమల బెడద ఎక్కువగా ఉండేదని.. శుభ్రం చేయడంతో ఆ ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

మెగా జాబ్‌మేళాలో 360 మంది ఎంపిక



అభ్యర్థికి ఎంపిక పత్రం అందజేస్తున్న అధికారులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు స్పందన లభించింది. 8 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 1090 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 523 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 360 మంది ఎంపికైనట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, శాంతి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండవాలు.. గుండెల్లో గుబులు


- కూలుతున్న రక్షణ గోడలు
- ఆందోళనలో నివాసులు
- చినుకు పడితే కునుకు కరువు



వాయుపుత్ర కాలనీ కొండ ప్రాంతంలో కూలిన రక్షణ గోడ



కూలిన రక్షణ గోడ శిథిలాలను తొలగిస్తున్న గ్రామస్తులు



హిమాచల్ నగర్ కొండ ప్రాంతంలో నివాసాలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని కొండవాలు ప్రాంతవాసులకు వర్షాకాలం వచ్చిందంటే ఒకటే గుబులు.. ఎక్కడ కొండచరియలు కూలుతాయో, మట్టి పెళ్లలు జారి మీద పడతాయోనని కంటిపై కునుకు కరువవుతోంది. పలు ప్రాంతాల్లో రక్షణ గోడలు లేకపోవడం, ఉన్న చోట్ల కూడా వర్షాలకు నాని కూలిపోతుండడంతో కలవరపడుతున్నారు. రక్షణ గోడలు నిర్మించి తమకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

కొండవాలు ప్రాంతాల్లో పరిస్థితి ఇదీ

- 59వ వార్డు హిమాచల్ నగర్, గంగానగర్, గణపతినగర్, లక్ష్మీనగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో సుమారు రెండు వేల మంది వరకు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా 15 ఏళ్లకు పైగా ఇక్కడే ఉంటున్నారు. ఆ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రక్షణ గోడలు లేవు, హిమాచల్ నగర్, గణపతినగర్ వంటి ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఉన్నా.. ఇటీవల కురిసిన వరస వర్షాలతో హడలిపోతున్నారు.
- 60వ వార్డు పరిధి హనుమాన్ సంజీవ్‌కాలనీ, ఇందిరాకాలనీ, అశోక్‌నగర్ వంటి కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు లేవు. హనుమాన్ సంజీవ్ కాలనీలో కొన్ని చోట్ల ఉన్నా అవి గత వారం భారీగా కురిసిన వర్షాలకు కూలిపోయాయి. ఈ ప్రాంతంలో అవసరమైన చోట్ల రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది. అలాగే ఇందిరాకాలనీ, అశోక్‌నగర్ కొండ ప్రాంతాల్లోనూ కొన్ని చోట్ల రక్షణ గోడలు నిర్మించాలి.
- 61వ వార్డు అచ్చినాయుడులోవ, జనతాకాలనీ వంటి కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు లేవు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉంటున్న వారు వర్షం వస్తే చాలు కలవరపడుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల నిర్మించాల్సిన రక్షణ గోడలకు సుమారు 2 నుంచి 3 కోట్ల రూపాయలు ఖర్చు అవుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆయా వార్డుల కార్పొరేటర్లు కౌన్సిల్‌లో వీటిపై ప్రతిపాదన పెట్టారు. అయితే, ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉంది. కాగా కొండవాలు ప్రాంతాల్లో నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా కొండవాలు ప్రాంతాల్లో అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోతున్నామని వివరిస్తున్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి



హనుమాన్ సంజీవ్‌కాలనీ, హిమాచల్‌నగర్, గణపతినగర్ తదితర కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలి. దీనిపై గతంలో అధికారులకు పలు మార్లు వినతులు ఇచ్చాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన చోట గోడలను పటిష్టంగా నిర్మించాలి.

– సంపత్‌కుమార్, మాజీ సైనికకాలనీ

ఇబ్బంది పడుతున్నారు



60వ వార్డు ఇందిరాకాలనీ, అశోక్‌నగర్ ప్రాంతాల్లో రక్షణ గోడలు లేకపోవడంతో ఆయా ప్రాంత వాసులు చినుకు పడితే హడలిపోతున్నారు. గత వారం కురిసిన వర్షాలకు రక్షణ గోడలు కూలడంతో వారు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– ఖాన్, ఇందిరాకాలనీ

కూలిన చోట కొత్త గోడలు నిర్మిస్తాం

ఇటీవల కురిసిన వర్షాలకు హనుమాన్ సంజీవ్‌కాలనీ, వాయుపుత్ర కాలనీ కొండ ప్రాంతాల్లో కూలిన రక్షణ గోడల స్థానంలో కొత్తగా రూ. 40 లక్షలతో రక్షణ గోడల నిర్మాణానికి నివేదిక తయారు రూపొందించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. త్వరలోనే మిగిలిన ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణ పనులు చేపడతాం.

– ఏడుకొండలు, డీఈ(వర్క్స్)

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ప్రతినిధులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి మాట్లాడుతూ రానురాను సంక్షేమ కళాశాలల హాస్టళ్లలో సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. విశాఖ జిల్లావ్యాప్తంగా 18 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉండగా దశాబ్దాలు గడుస్తున్నా మూడు హాస్టళ్లకు తప్ప మిగతా వాటికి సొంత భవనాలు లేవని అన్నారు. అలాగే హాస్టళ్లలో సరైన తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులే బయటి నుంచి టిన్నులతో నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధలు పడుతున్నారన్నారు. గతంలో పాత బియ్యం హాస్టళ్లకు సరఫరా చేస్తాం అని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సకాలంలో మెస్ బిల్లులు విడుదల కాక మెనూ అమలు చేయలేమని వార్డెన్లు తెగేసి చెబుతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని హాస్టళ్లలో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్. రుద్రి, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్, లక్ష్మణ్, సతీష్, మధు, లోకేష్, జానకి, హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రకటనలో వేలం ఎప్పుడు నిర్వహించేదీ తెలుపుతామని, పూర్తి వివరాలకు జోన్-5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

గంటలో దొంగను పట్టుకున్న పోలీసులు



మహిళకు ఆభరణం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: ఆటోలో ఒక మహిళ నుంచి బంగారు ఆభరణాన్ని కొట్టేసిన వ్యక్తిని గంటలోనే పోలీసులు పట్టుకుని బాధితురాలికి నగ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం దొండపర్తి ప్రాంతానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న లలితా జ్యుయలర్స్‌లో పావుతులం బంగారు ఆభరణం కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆ నగను కొట్టేశాడు. దీంతో ఆమె వెంటనే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీపీ (క్రైమ్) వెంకటరత్నం పర్యవేక్షణలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గంటలోనే ఆ వ్యక్తిని పట్టుకుని నగ స్వాధీనం చేసుకున్నారు. దాన్ని సీపీ చేతుల మీదుగా బాధితురాలు వరలక్ష్మికి శుక్రవారం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- జీవీఎంసీ జోన్-5 కమిషనర్ కృష్ణ



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ కృష్ణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార ఈస్ట్ పార్కులో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో మార్పుల వల్ల ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వ్యాప్తి చెందకుండా వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి ఇంటింటికీ వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని చెప్పారు. వారానికోసారి ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి సహకరించాలని జెడ్సీ కోరారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం గుర్తు తెలియని ఒక యువకుడి మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. వివరాలిలా.. తాటిచెట్లపాలెం 28 బస్‌స్టాప్ దరి సుమారు 32 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉన్నాడు. అటువైపు వెళ్తున్న బ్లూకోట్స్ కానిస్టేబుళ్లు.. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్‌కు సమాచారమిచ్చారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే ఫోర్త్‌టౌన్ సీఐ నంబర్ 94407 96012, స్టేషన్ నంబర్ 08912 710695కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

పూడికల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



ములగాడ వీధి కాలువలో వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవాని పాలెం గెడ్డతో పాటు చిన్న ములగాడ ప్రాంతంలోని వీధి కాలువలను శుక్రవారం పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. కాలువల్లో నిలిచిపోయిన వ్యర్థాలపై 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం క్షీణించిన పారిశుధ్యం శీర్షికతో ప్రచురితమైన వార్తకు శానిటరీ అధికారులు స్పందించారు. గెడ్డలో నిలిచిన వ్యర్థాలతో పాటు వీధికాలువల్లో నిలిచిన వ్యర్థాలను తొలగించారు. దీంతో ఆయా ప్రాంత వాసులు వార్డు శానిటరీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రక్షణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఈ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేవల్ ఆర్మమెంట్ డిపో మెయిన్ గేటు వద్ద ఎన్ఏడీ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ 8వ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, రక్షణ రంగంలో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఓటీ, హెచ్‌ఆర్‌ఏలు ఇవ్వాలన్నారు. కొత్త కార్మిక చట్టంతో పాటు కొత్త పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించక పోతే పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఈ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే శాశ్వత పరిష్కారం

- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1,268వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో ప్రసంగిస్తున్న మంత్రి రాజశేఖర్

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. తద్వారా స్టీల్‌ప్లాంట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1268వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బ్లాస్ట్‌ఫర్నేస్, సింటర్ ప్లాంట్, వాటర్ మేనేజ్‌మెంట్, ఈఎస్ఎఫ్ విభాగాలకు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకులు లేకపోవడం వల్ల పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నామన్నారు. తద్వారా ప్లాంట్ నష్టాల్లోకి నెట్టబడిందని పేర్కొన్నారు. సెయిల్‌లో విలీనానికి ప్రజా ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆఫీస్ బేరర్ పూతి పోతయ్య రెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.ఎ.నాయుడు, బీఎఫ్ విభాగం నాయకులు పోలీసు నాయుడు, పాల అప్పలరెడ్డి, నల్ల రవి, పి.వి.నగేష్, ఈఎస్ఎఫ్ నాయకులు గొందేశి ప్రభాకరరెడ్డి, మింది దేవుడు, సింటర్ ప్లాంట్ నాయకులు డి.వి.కె.రాజు, కె.వి.రమణ, ఎం.పెంటారావు, వాటర్ మేనేజ్‌మెంట్ నాయకులు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొండవాలులో శిథిల గృహాలను గుర్తించండి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితిని, శిథిల గృహాలను గుర్తించాలని సచివాలయ ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలను జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో జోన్-5 ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వివరాలు వెంటనే సేకరించాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ వెంకటరావు, టీపీవో విజయ్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం.. ప్రయాణం నరకప్రాయం



కొత్తపాలెం ఆదర్శనగర్ రోడ్డులో ప్రమాదకరంగా గోతులు



పాత గోపాలపట్నం సింహాద్రి, శేషాద్రి అపార్ట్‌మెంట్ల వద్ద పాడైన రహదారి

- గోతులమయంగా బాజీ జంక్షన్ – కొత్తపాలెం మార్గం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు



అధ్వాన స్థితిలో బాజీ జంక్షన్ - గోపాలపట్నం రహదారి

గోపాలపట్నం: బాజీ జంక్షన్ నుంచి కొత్తపాలెం వరకు ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గోతులు, గతుకులతో నిండి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారి మరింత దారుణంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఏమరపాటున గోతుల్లో గాయాల పాలవడం ఖాయమని స్థానికులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాజీ జంక్షన్ నుంచి పాత గోపాలపట్నం వెళ్లే రోడ్డులో మలుపు వద్ద, పాత గోపాలపట్నం తరువాత సింహాద్రి, శేషాద్రి అపార్ట్‌మెంట్ల వద్ద రోడ్డు బాగా దెబ్బతింది. కొత్తపాలెం ఆదర్శ నగర్ వద్ద రోడ్డులో గోతులు ఏర్పడటంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

- స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్



లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ దేవసాగర్

సబ్బవరం: లెప్రసీ వ్యాధి గ్రస్తులను గుర్తించి తగిన వైద్య సేవలు అందించడానికి సర్వే చేస్తున్నట్టు లెప్రసీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. దేవసాగర్ చెప్పారు. సబ్బవరంని సందర్శించి లెప్రసీ వ్యాధి గ్రస్తులను గుర్తించడానికి చేస్తున్న కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. లెప్రసీ సర్వే జరిగే గ్రామాలను సందర్శించడంతో పాటు సర్వేలో పాల్గొన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. సబ్బవరంలో గ్రామస్తులతో సంభాషించి లెప్రసీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ కార్యకర్తలు చేసే సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారు. లెప్రసీకి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పాత కేసులతో పాటు సస్పెక్టెడ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ లెప్రసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. సత్యవతి, లెప్రసీ ఎన్జీవో స్టేట్ కోర్డినేటర్ డాక్టర్ ప్రియదర్శిని, అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎంవీఎస్‌కే బాలాజీ, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి, డాక్టర్ బి. ఆశ, సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్‌ఈవో కె. జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.